క్లుప్తంగా

చెరువుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో కొత్తగా నాలుగు చెరువులను నిర్మించడం కోసం రూ.107.6 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జలవనరులశాఖ మదనపల్లె ఈఈ టీ.సురేంద్రరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలంలోని చింతలరేవుపల్లె వద్ద రూ.55 కోట్లతో, పెద్దమండ్యం మండలంలోని లంపవంక గుడిసెవారిపల్లె వద్ద రూ.11.30 కోట్లతో, కుషావతీ నది సమీపంలో గచ్చంవారిపల్లె వద్ద రూ.35 కోట్లతో, ఆకుమానుగుట్ట వద్ద రూ.6.30 కోట్లతో కొత్త చెరువుల నిర్మాణం కోసం సమగ్ర నివేదికలను పంపామని, ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు. అలాగే మదనపల్లె పట్టణంలో ప్రవహిస్తున్న బాహుదా, బుగ్గవంక, ముగ్గురాళ్లవంకలపై రూ.7.83 కోట్లతో బ్రిడ్జీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

బి.కొత్తకోట: సామాజిక న్యాయమే మహాజన సోషలిస్టు పార్టీ లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దుమ్ము చిన్నా అన్నారు. బుధవారం ఆ పార్టీ తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో భవానీ వెంకటేష్, ఈశ్వరప్ప, చౌడప్ప, రమణ, దేవరాజు, శంకరబాబు, గంగులప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

పేదల కోసమే పథకాలు

వాల్మీకిపురం: పేద ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని జడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా మంజూరైన 218 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్ కుమార్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, నాయకులు రాయుడు, రాజేష్, రఘు, వెంకటేష్, రమేష్, మునీశ్వర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

వాల్మీకిపురం: శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 86మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు భవ్య, ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఈవో ఉదయ్‌కుమార్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, పిఆర్‌వో గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గుర్రంకొండ విద్యార్థులు

గుర్రంకొండ: రాష్ట్రస్థాయిలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలకు గుర్రంకొండ జెడ్పీహైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెడ్మాస్టర్ శివయ్య, పీడీ చింతిర్ల రమేష్‌బాబు తెలిపారు. సంధ్యారాణీ, రేవంత్‌కుమార్‌రెడ్డిలు ఇటీవల చిత్తూరు జిల్లా పెద్ద పంజానిలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. వీరు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు తరపున అండర్–17 రాష్ట్రసాయిలో పల్నాడు జిల్లాలో జరిగే వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

అయ్యప్పస్వామికి పెద్దపూజ

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం పెద్దపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్పస్వామి దీక్ష ధరించిన భక్తులకు మండల దీక్ష పూర్తికావడంతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభించి, జలాభిషేకం, పంచామృతాభిషేకం, అగ్నిగుండ ప్రవేశం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిపై అయ్యప్పస్వామి ఊరేగారు.

మెరుగైన సేవలు అందించాలి



ఆరోగ్యశ్రీ ఆపరేషన్ల రికార్డు పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

బి.కొత్తకోట: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్. మురళీ వైద్యులను కోరారు. బుధవారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, ఔషధాల నిల్వ వివరాలు, ఔషధాల పంపిణీ, పడకలు, రక్త పరీక్షల ల్యాబ్, ఇన్‌పేషంట్ గదులను పరిశీలించారు. బటన్‌హోల్ ఆపరేషన్ చేయించుకొన్న మహిళతో మాట్లాడి వైద్యసేవల గురించి తెలుసుకొన్నారు. జనరల్ సర్జన్, మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ అందిస్తున్న వైద్య సేవలను ఆర్డీఓకు వివరించారు. తర్వాత ఆరోగ్యమిత్రతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జరుగుతున్న ఆపరేషన్ల వివరాలు తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. తర్వాత స్థానిక పౌరసరఫరాల గోదామును తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ ధనుంజయులు, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓ అశోక్ పాల్గొన్నారు.

క్షయ.. భయపడొద్దయ్యా!


క్షయ గాలి ద్వారా సంక్రమించే వ్యాధి. టీబీ అని కూడా పిలిచే ఈ వ్యాధి ఒకప్పుడు మహమ్మారిలా ప్రపంచ ప్రజలను వేధించేది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికే ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. హెచ్ఐవీ ఉన్నవారికి క్షయ త్వరగా సంక్రమిస్తుందని కూడా వారంటున్నారు. ఈ నేపథ్యంలో క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ని-క్షయ్ మిత్ర పథకం తీసుకొచ్చింది. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

టీబీ వ్యాధిగ్రస్తుడికి పౌష్టికాహారం కిట్ అందజేస్తున్న జిల్లా టీబీ నిర్మూలన అధికారి డాక్టర్ శైలజ, సిబ్బంది



టీబీ కేంద్రం	ని-క్షయ్ మిత్రులు
మదనపల్లె	20
రాయచోటి	43
లక్కిరెడ్డిపల్లె	13
నందలూరు	13
రైల్వేకోడూరు	11
పీలేరు	16
తంబళ్లపల్లె	4
వాల్మీకిపురం	3





- టీబీ రోగులకు ఆసరాగా నిలుస్తున్న ని-క్షయ పథకం
- పౌష్టికాహారం అందిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ
- జిల్లాలో 1448 మంది టీబీ రోగులు
- ఇప్పటి వరకు 283 మంది దత్తత
- క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మదనపల్లె సిటీ: క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దే దిశగా చర్యలు మొదలయ్యాయి. బాధితులకు పౌష్టికాహారాన్ని అందించి టీబీ నుంచి విముక్తి చేసేందుకు వైద్య,ఆరోగ్యశాఖ కదులుతోంది. జిల్లాలో టీబీ చికిత్స పొందుతున్న వారికి 'ని-క్షయ్ మిత్ర' పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమం ప్రారంభించారు. క్షయ వ్యాధి బాధితులకు 'ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్' ని-క్షయ్ మిత్ర పథకాన్ని ఇందుకు వినియోగించుకోవాలని అధికారులు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ద్వారా గత ఏడాది సెప్టెంబర్ 9న పథకం ప్రారంభమైంది. 2025 నాటికి టీబీ రహిత దేశంగా ఉంచాలన్నదే ఈ పథకం ముఖ్యోద్దేశం. క్షయరోగులకు సహాయం అందించాలని భావించే వారు ముందుకు వచ్చి ని-క్షయ్ పోర్టల్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. జిల్లాలో 123 మంది ని-క్షయ్ మిత్ర పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. కనీసం ఆరు నెలల పాటు ఒక టీబీ పేషంట్ దత్తత తీసుకునేలా నెలకు రూ. 500– 700 విలువ గల పోషకారాన్ని అందించాల్సి ఉంటుంది. తద్వారా రోగ నిరోధకశక్తి పెరిగి బాధితుడికి టీబీ నుంచి పూర్తిగా విముక్తి కలుగుతుంది.

జిల్లాలో టీబీ రోగులు : 1448 మంది
టీబీ యూనిట్లు : 8
దత్తత తీసుకున్న రోగుల సంఖ్య : 283 మంది

రోగుల కిట్‌లో ఏముంటాయంటే..

జిల్లాలో 1448 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అధికార లెక్కలు తేల్చాయి. నిత్యం వాడే మందుల కంటే బలమైన ఆహారమే బాధిత రోగులకు ఆరోగ్యభరోసా ఇస్తుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే తాజా పథకం కింద ఒక్కొక్కరికి పౌష్టికాహారం కిట్లను తయారు చేస్తున్నారు. కిలో గోధుమపిండి, కిలోన్నర కందిపప్పు, పెసరపప్పు, కోడిగుడ్లు, ఒక ప్యాకెట్ నూనె, పప్పు ఉండలు, ప్యాకెట్ వేరుశనగ ఉండలు, పావు కిలో ఖర్జూరం, పావు కిలో ద్రాక్ష కిట్‌గా చేసి రోగులకు అందిస్తున్నారు. వీటిని తీసుకున్న రోగుల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని భావిస్తున్నారు.



టీబీ రోగులకు అందించేందుకు సిద్ధంగా ఉంచిన కిట్‌లు

ముందుకు వస్తున్న దాతలు

జిల్లాలో క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలన చేసే దిశగా ఎక్కువ మంది భాగస్వాములవుతున్నారు. వ్యాధిగ్రస్తులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. టీబీ బాధితుల్లో ఇప్పటి వరకు 283 మందికి పౌష్టికాహారం సమకూర్చేందుకు ని-క్షయ్ మిత్రలో పేర్లు నమోదు చేసుకున్నారు.

దాతలు ముందుకు రావాలి



ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద ప్రతినిధులు, వ్యాపారులు తదితరులు తమ వంతుగా కనీసం క్షయ వ్యాధిగ్రస్తులను ఒక్కరినైనా దత్తత తీసుకోవాలి. ప్రతి టీబీ పేషెంట్‌కూ క్రమం తప్పకుండా వైద్య,ఆరోగ్యశాఖ ద్వారా వైద్యులు మందులు అందిస్తున్నారు. వారిలో రోగనిరోధక శక్తి పెంచేందుకు పోషకాహారం అందించాల్సి ఉంది. ఇందుకు దాతలు స్వచ్ఛందంగా స్పందించాలి. ఇప్పటికే కొందరు ముందుకు రావడం అభినందనీయం. మరింత మంది ముందుకు వచ్చి టీబీ రహిత జిల్లాగా చేయడానికి సహకారం అందించాలి. –డాక్టర్ శైలజ, జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, టీబీ నిర్మూలన అధికారి,అన్నమయ్య జిల్లా

పేదల సంక్షేమం కోసమే పథకాలు

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



కమ్మచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

పెద్దతిప్పసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశ పెట్టినా పేదల సంక్షేమం కోసమే అని తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన కమ్మచెరువు, గొల్లపల్లి, గారచెట్లపల్లి, మొరుసుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలన, జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం కమ్మచెరువులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేష్ అనే యువకుడిని పరామర్శించి కొంత నగదు సాయం అందించారు. మెరుగైన వైద్యం కోసం సిఫారసు చేస్తామని భరోసా ఇచ్చారు. మొరుసుపల్లిలో రఘునాథ్‌రెడ్డిని పరామర్శించారు. పక్కా గృహాల మంజూరులో అర్హులను విస్మరిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, కన్వీనర్ సుబ్బరాం, సర్పంచ్ చెరువు నరసమ్మ, ఎంపీటీసీ చేలూరు కాంతమ్మ, సొసైటీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, స్థానిక నాయకులు వెంకటసుబ్బారెడ్డి, బాబురెడ్డి, గొర్ల శీనా, కోటి శీనా, పాల శీనా, టైలర్ శంకర్, ఉత్తంరెడ్డి, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, ఏపీ మంజుతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మదుమూరులో..

మండలంలోని మదుమూరు పంచాయతీలో గురువారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి అన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా కోరారు. బుధవారం పట్టణంలోని 27వవార్డులో కౌన్సిలర్ షేక్‌కరీముల్లా ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్ బాషా, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్స్‌ను ప్రజలకు అందజేశారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు ప్రతినెలా 1వ తేదీన పింఛను ఠంచనుగా అందుతోందని తమ సంతోషాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. జనవరి నుంచి అవ్వాతాతల పింఛన్ రూ.2,750కు పెంచారని, పెద్దలందరూ నిండుమనస్సుతో జగనన్నను ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, వసీం, భాను, కోఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, మంజుల, గట్టు చంద్ర శేఖర్ నాయుడు, రహీం, చరణ్ తేజ్, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ పంపిణీ

కలకడ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెంచిన నూతన పింఛన్ అందజేస్తామని ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కదిరాయచెర్వు పంచాయతీలో మంజూరైనవారికి మండల ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. అనంతరం కలకడ సచివాలయంలో సర్పంచ్ ప్యారీజాన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముడియంవారిపల్లె పంచాయతీలో నూతనంగా మంజూరైన 12 మందికి సర్పంచ్ శాంతమ్మ పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, మండల కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, జిలానీ, ఎంపీడీఓ నారాయణ, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారని జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్టలో పింఛన్ల పెంపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఆమె మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారులకు జగనన్న ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి రూ. 2,750 అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, వైస్ సర్పంచ్ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి సిగ్బతుల్లా, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎలిశెట్టి వెంకటరమణ, నాయకులు ముబారక్, చలపతి, యల్లయ్య, బలరామ్‌రెడ్డి, నాగిరెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పీలేరు : వైఎస్సార్ పెన్షన్ కానుకతో వృద్ధులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడరేవుపల్లె గ్రామంలో పింఛన్ల పెంపు వారోత్సవాల కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలో కన్నెమడుగు, కోటకొండ, రేణుమాకులపల్లె పంచాయతీలలో బుధవారం పెన్షన్ వారోత్సవాలు నిర్వహించారు. నూతనంగా పెన్షన్లు మంజూరైనవారికి స్థానిక ప్రజాప్రతినిధులు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు జ్యోతి , అరుణ, ఎంపీటీసీలు మహేష్, కవిత, నాయకులు చంద్రశేఖర్, పద్మనాభరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ మల్లికార్జున, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్ రెడ్డి బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, కమలాకర్‌రెడ్డి

ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి

వాల్మీకిపురం: బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయీ బ్రెయిలీ జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత తెలుగు అధ్యాపకులు క్రిష్ణమూర్తి మాట్లాడుతూ అంధులు విద్యనభ్యసించే విధంగా వారి కోసం ప్రత్యేకంగా లిపిని అభివృద్ధి చేసి అంధులకి బ్రెయిలీ ఆరాధ్య దైవం అయ్యాడన్నారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, ఉపాధ్యాయులు శంకర, నాగరాజ, నాగేశ్వర, దుర్వాసులు నాయుడు, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

బి.కొత్తకోట: అంధులకు లూయీ బ్రెయిలీ దేవుడని ఎంఈవో రెడ్డిశేఖర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం బ్రెయిలీ జయంతి వేడుక నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం అంజద్ అలీఖాన్, భవిత టీచర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: లూయీ బ్రెయిలీ జయంతి స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం పద్మావతి, భవిత సిబ్బంది రెడ్డమ్మ, హేమలత, రెడ్డిరాణి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఉపా ధ్యాయుడు గురుప్రసాద్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు.

రామసముద్రం: రామసముద్రం భవిత పాఠశాలలో లూయీ బ్రెయిలీ జయంతిని మండల విద్యాశాఖాధికారి హేమలత, తూర్పుపాఠశాల హెచ్‌ఎం హేమలత ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు వినికిడి యంత్రాలను ,వీల్‌చైర్స్ అందించారు.

శ్రీరామ్ నోరు అదుపులో పెట్టుకో

– రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడిపై ధ్వజమెత్తిన బీసీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ, చేనేత సంఘం నాయకులు

మదనపల్లె : టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని, కౌన్సిలర్ స్థాయికి కూడా సరిపోని నీవు మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడమేంటని వైఎస్సార్ సీపీ బీసీ, చేనేత నాయకులు మండిపడ్డారు. నీరుగట్టువారిపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డిపై తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బోగస్ చేనేత సొసైటీలతో నేత కార్మికులను మోసగించి వారి రెక్కల కష్టాన్ని దోచుకున్న శ్రీరామ్ చినబాబు నీతులు మాట్లాడుతుంటే గురిగింజ సామెత గుర్తుకొస్తోందన్నారు. రాజకీయాల్లో ఎదగాలనుకుంటే గౌరవప్రదంగా జీవించాలని, దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత సంఘ నాయకులు శీలం రమేష్, భువనేశ్వరి సత్య, దండు రామాంజులు, కౌన్సిలర్ ఎస్వీ రమణ, మాజీ కౌన్సిలర్ పురాణం చంద్రశేఖర్, అశోక్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు అరికట్టేందుకు కృషి

తంబళ్లపల్లె: ములకలచెరువు సర్కిల్‌ని, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పీటీయం, ములకలచెరువు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పూర్తిగా నేరాలు అరికట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సీఐ షాదిక్‌అలీ ఎస్‌ఐలను ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. నమోదైన కేసులు, నేరాలు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు రామక్రిష్ణారెడ్డి, వెంకటేష్, మధురామచంద్రుడు, ఏఎస్‌ఐ గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

పరామర్శ

పీలేరు : పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పకీర్‌అహ్మద్ బుధవారం ఆకస్మిక మరణం చెందారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కట్టుకాలువ వీధికి వెళ్లి పకీర్ అహ్మద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, నాయకులు పాల్గొన్నారు.

6న ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి తిరువణ్ణామలైకు 6న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు బయలుదేరి తిరిగి 7న ఉదయం 9 గంటలకు మదనపల్లెకు చేరుతుందన్నారు. రానుపోను చార్జీలు రూ.790 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 99592 25677, 91601 86645ను సంప్రదించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు

పీలేరు రూరల్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతి, చిత్తూరు రోడ్డు, కడప రోడ్డు మార్గంలో సర్పంచ్ హబీబ్‌బాషాతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించడం, బాటిల్లు పడేయడం లాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విచక్రవాహనం చోరీ

మదనపల్లె : గుర్తుతెలియని వ్యక్తులు ఇంటివద్ద ఉంచిన ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన కే.సుజాత బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కలకడ : నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీటి స్వామి తెలిపారు. బుధవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లె సమీపంలోని పెద్దవంక వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ తనసిబ్బంది తో దాడులు నిర్వహించారు. ఈదాడులలో బొంతలవారిపల్లెకు చెందిన నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి పేకాట ముక్కలు , రూ.6,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆక్రమిత స్థలాలు గుర్తింపు

రామసముద్రం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని చెంబకూరు బస్టాండ్ ఆవరణంలో ఆక్రమిత స్థలాలను బుధవారం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. ఇటీవల మండలానికి వచ్చిన కలెక్టర్ చెంబకూరులో సచివాలయం ఆవరణంలో దురాక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తహశీల్దార్ విశ్వేశ్వరశాస్త్రీ తెలిపారు. ఈ మేరకు డ్రోన్‌తో చిత్రీకరించిన చిత్రాలపై స్పష్టత ఎంత వరకు ఉందని కలెక్టర్‌కు పంపించి ఆపై వచ్చిన నివేదికను తెలియచేస్తామన్నారు. అనంతరం చెంబకూరులోని 31వ నెంబరు గల రేషన్‌షాపును తనిఖీ చేశారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పపై ప్రత్యేక దృష్టి

తంబళ్లపల్లె: ప్రభుత్వం అమలు పరుస్తున్న జగనన్న స్వచ్ఛసంకల్ప అమలుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో శ్రీలక్ష్మీ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు స్వామిత్వ సర్వే, హౌస్‌ట్యాక్స్ వసూళ్లు, జగనన్న స్వచ్ఛ సంకల్పను అమలు పరిచే అంశాలపై రీసోర్సుపర్సన్ వాల్మీకిపురం పంచాయితీ కార్యదర్శి బయ్యారెడ్డి శిక్షణ ఇచ్చారు.

